క్లుప్తంగా

420 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బల్లుకోట గిరిజన గ్రామం నుంచి బొలెరో వాహనంలో 21 క్యాన్లతో అక్రమంగా తరలిస్తున్న 420 లీటర్ల సారాను కురుపాం ఇన్‌చార్జి ఎస్‌ఐ షణ్ముఖరావు, పోలీసు సిబ్బంది ముందస్తు సమాచారంతో శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. దాడుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన బిడ్డిక ఉగాదిని అరెస్టు చేశారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు.

'హౌసింగ్ డే'


కార్యక్రమంలో పాల్గొన్న ఏఈ అఖిల్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ గ్రామ పంచాయతీలోని సన్యాసిరాజుపేట గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ వి.అఖిల్‌నాయుడు జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో సమావేశమై, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరించారు. నిర్మాణాలు చేస్తున్న వారికి బిల్లులు కూడా వెంటనే చెల్లించడం జరుగుతోందని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుపై సమీక్ష


సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి

భామిని: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదుపై శనివారం సమీక్ష నిర్వహించారు. పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రతీ రైతు ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని, ప్రభుత్వ పథకాలను పొందాలని తెలిపారు.

వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లత, మణి దంపతులు

వీరఘట్టం: విజయవాడలో హౌసింగ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్‌ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లత శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలనుకుంటున్న పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరఘట్టం పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ


గణిత బోధనా చార్టులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇచ్చే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయురాలు ఎ.లిల్లీరాణి, డీఆర్పీలు ఉత్తమ గణిత బోధనా పద్ధతులను వివరించారు. ఇక్కడ నేర్చుకున్న మెలకువలు విద్యాబోధనలో పాటిస్తూ విద్యార్థుల విద్యాప్రగతికి తోడ్పడాలని సూచించారు. అనంతరం గణిత బోధనా చార్టులను ప్రదర్శించారు.

వినాయక లడ్డూ రూ.49,999


వేలంపాటలో దక్కించుకున్న లడ్డూను ఊరేగిస్తున్న భక్తులు

భామిని: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సొలికిరి గ్రామంలో గణేషుని మండపం వద్ద ఉంచిన లడ్డూ వేలంపాట శనివారం నిర్వహించారు. భక్తుడు కొత్తకోట తిరుమలరావు రూ.49,999కు లడ్డూను దక్కించుకున్నారు. మధ్యాహ్నం ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు స్వామి అన్నప్రసాదం అందజేశారు. ఇదిలా ఉండగా, మండలంలోని సొలికిరి, పాతబిల్లుమడ, నులకజోడు, కీసర గ్రామాల్లో గణనాథుని నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.


పాలకొండ రూరల్: లుంబూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే కళావతి, పక్కనే ఎమ్మెల్సీ విక్రాంత్


కురుపాం: జరడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ బుక్‌లెట్ చూపిస్తున్న వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది


సీతంపేట: దారపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి భరోసా..


పాలకొండ: పాలకొండ మండల కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రదర్శించిన మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోగులకు 15 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులు ఉచితంగా అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. పాలకొండ పట్టణంలో 1150 మందికి, జరడ గ్రామంలో 226 మందికి, వీరఘట్టం మండల కేంద్రంలో 388 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

–సాక్షి నెట్‌వర్క్.


వీరఘట్టం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎంపీపీ వెంకటరమణ నాయుడు, వైద్య సిబ్బంది


గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటిలో రోగి కంటిని తనిఖీ చేస్తున్న సిబ్బంది


కొమరాడ: విక్రంపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ఉత్తమ విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. శనివారం మండలంలోని భద్రగిరి గురుకులం(ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజ్)లో జరిగిన విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు మంచి విలువలతో కూడిన విద్యనందించాలని కోరారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యం, విద్యతో పాటు నడవడికపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను వినాలని, ఉత్తమ బోధకులను అనుసరించాలన్నారు. పెద్దలను గౌరవిస్తూ మంచి నడవడికను అలవర్చుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' పరిశీలించిన డీఈవో

పార్వతీపురం టౌన్: జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలు, వాటి తీరు తనిఖీల్లో భాగంగా శనివారం పార్వతీపురం మండలం తాళ్లబురిడి ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం పనితీరును డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తీరును అడిగి తెలుసుకున్నారు. రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు ప్రతిరోజూ అందించాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డిప్యూటీ డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

భామిని: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. శనివారం స్థానిక కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం)ని ఆమె సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులు చదువుతున్న తీరు, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనా తీరుపై ఆరాతీశారు. విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి చదువుపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించిన ఆమె వారి విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా అంచనా వేశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆమె వెంట ఎంఈవో వి.భాస్కర రావు, ఎస్‌వో బి.శారద తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం


సమావేశం వాయిదా తీర్మానం ప్రకటిస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ హనుమంతురావు

పాలకొండ: స్థానిక పట్టణంలో నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. నగరపంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి భర్త నాగేశ్వరరావు ఇటీవల మరణించడంతో సమావేశంలో సంతాపం ప్రకటించారు. సభ్యులంతా నగరపంచాయతీ అధ్యక్షురాలికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సమావేశం అజెండాను ప్రవేశపెట్టి, సభ వాయిదా తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్‌కుమార్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, కొడెం విజయ్‌కుమార్, భాసూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



ఇంద్రజాల ప్రదర్శన ద్వారా మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఏకలవ్య పాఠశాల, కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో శనివారం చేపట్టిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల్లో మూఢ నమ్మకాలు తొలగించేలా జన విజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. ప్రతీ విద్యార్థి శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని, మూఢ నమ్మకాలను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజూర్ భాషా, ప్రిన్సిపాల్ సత్యవతి, ఎస్.పెంటన్న, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


వ్యాయామ ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆ విధంగా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం సమావేశమైన ఆమె విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక ఆటలో ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి, బయటకు తీయాలన్నారు. విద్యార్థులకు వారికి బాగా ఇష్టమైన క్రీడలో వారిని తగిన విధంగా ప్రోత్సహిస్తే వారు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగగలరన్నారు. సమావేశంలో ఎంఈవో-2 కె.సోంబాబు, స్కూల కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ వి.పుష్పనాథం, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ని సురేష్‌కుమార్, వండాన రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' వెలుగులు


ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం మండలంలోని లుంబూరు గ్రామంలో సర్పంచ్ టి.ఉపేంద్రకుమార్ నేతృత్వంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆయన ఓ వైపు అభివృద్ధి చేపడుతూనే మరోవైపు సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, రేషన్ కార్డు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం రూపంలో లబ్ధి జరుగుతూనే ఉందన్నారు. అలాగే ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ చెప్పే అబద్ధపు హామీలు నమ్మవద్దన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు, పడాల రామచంద్రరావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, మజ్జి నవీన్‌కుమార్, ఎస్.అప్పారావునాయుడు, ఏవో డొంక త్రినాధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


గడ్డి కోసే యంత్రం అందజేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు కోరారు. శనివారం మండలంలోని ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మంజూరు చేసిన గడ్డి కత్తిరించే యంత్రాన్ని రైతుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడిరైతులు మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు రూపొందించి, అమలు చేస్తోందన్నారు. పాల దిగుబడిని పెంచేందుకు ప్రభుత్వం పశుగ్రాస విత్తనాలను కూడా రాయితీపై అందజేస్తోందన్నారు. పశుగ్రాసంను ముక్కలుగా కోసి, పశువులకు వేయడం వల్ల గడ్డి వృథాను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ సుస్మిత

కురుపాం: మండలంలోని పాడి గ్రామంలో ఆరిక ప్రకాశరావు మృతి చెందడంతో ఆయన భార్య యశోదకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ ఎం.సుస్మిత చేతులమీదుగా శనివారం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం ఎన్నో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. మిగిలిన రూ.90 వేలను నామిని బ్యాంకు ఖాతాలో వారం రోజుల్లోగా జమ చేయనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హరితహారం కార్యక్రమం శనివారం నిర్వహించి, కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. కొత్త మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతీ వ్యక్తి తమవంతు బాధ్యతగా ఓ మొక్కను పెంచి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు భారీ గండి

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ మండలం, బెజ్జి రెవెన్యూ పరిధిలోని కూరాకుల చెరువుకు భారీ గండి పడింది. దీంతో చెరువులోని నీరు వృథాగా పోతోంది. 15 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువు నీటితో వీరఘట్టం మండలంలోని తలవరం గ్రామానికి చెందిన 60 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ప్రస్తుతం నీరు వృథా అవుతుండడంతో అధికారులు స్పందించి, గండిని పూడ్చే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


చెరువుకు పడిన గండి ద్వారా వృథాగా పోతున్న నీరు